క్లుప్తంగా

చంద్రబాబుకు రాజ్యాధికారం అసాధ్యం

నెహ్రూనగర్: ఆంధ్ర రాష్ట్రంలో చంద్రబాబు మరలా తిరిగి రాజ్యాధికారం సాధించడం సాధ్యం కాదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోరుగడ్డ అనిల్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఆయన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు తన స్వార్థ రాజకీయం కోసం ప్రజల్లో విధ్వంసం, అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి గిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

నెహ్రూనగర్: పోక్సో, మహిళా కేసుల్లో బాధితులకు సత్వర నాయం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మెంబర్ బత్తుల పద్మావతి సూచించారు. మహిళా ప్రాంగణంలోని దిశ, వన్ స్టాప్ సెంటర్‌ను గురువారం ఆమె సందర్శించారు. రికార్డుల్ని పరిశీలించారు. సఖి కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి అన్ని సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా.. లేదా? అని పరిశీలించారు. గుంటూరు జిల్లాలోని సఖి కేంద్రం మిగతా జిల్లాల కంటే చురుకుగా బాధితులకు సేవలందించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

బాలమద్దయ్యకు డాక్టరేట్



ఏఎన్‌యూ: పొలిటికల్ సైన్స్ విభాగ పరిశోధకుడు కె. బాలమద్దయ్యకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ పి. కిరణ్మయి తెలిపారు. ఆయన పొలిటికల్ సైన్స్ పరిశోధనా పర్యవేక్షకుడు బి. ఉదయ ప్రకాష్ పర్యవేక్షణలో 'స్వచ్ఛ భారత్ యాన్ ఇన్షియేటీవ్ ఇన్ ఇంప్రూవింగ్ అర్బన్ శానిటేషన్ ఇన్ ఇండియా: విత్ స్పెషల్ రిఫరెన్స్ టూ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకుగాను యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని పేర్కొన్నారు.

కళాశాలలో ఇరువర్గాల విద్యార్థుల గొడవ

కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

గుంటూరు ఈస్ట్: కళాశాలలో గొడవపడిన ఇరువర్గాల విద్యార్థులకు పట్టాభిపురం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. స్టేషన్ పరిధిలోని ఓ కళాశాలలో గురువారం జూనియర్ విద్యార్థి, సీనియర్ విద్యార్థి బాత్‌రూం వద్ద ఎదురు పడి, ఎవరు ముందుకు బయటకు వెళ్లాలనే విషయంలో గొడవ పడ్డారు. సీనియర్లు, జూనియర్లు రెండు వర్గాలుగా ఏర్పడి ఘర్షణకు దిగారు. గొడవ పెద్దదవుతుందన్న సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి రెండు వర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు సమాచారం.

వృద్ధురాలి అదృశ్యం



వృద్ధురాలి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుపేట 3వ లైనుకు చెందిన 60 సంవత్సరాల దాసరి మంగమ్మ బుధవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వృద్ధురాలిని గుర్తించిన వారు 8688831336 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: కుటుంబ కలహాలతో మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతీనగర్‌కు చెందిన గ్యారా ప్రేమ్‌కుమార్ అలియాస్ చంటి (37) పెయింటర్‌గా జీవిస్తుంటాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో కలహాలు ఏర్పడటంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు తెలపగా మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని తండ్రి ప్రకాశరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తప్పుడు రాతలు, ప్రచారాలు మానుకోవాలి

కాకుమాను: నిద్ర లేచిన దగ్గర నుంచి కొన్ని దిన పత్రికలు, చానళ్లు ప్రభుత్వంపై తప్పుడు రాతలు, ప్రచారాలు చేయడం మానుకోవాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ తెలిపారు. స్థానిక శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో గురువారం రాత్రి ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత కుటుంబంపై తప్పుడు రాతలు, ప్రచారాలు ప్రసారం చేయడంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ అనునిత్యం రాష్ట్ర ప్రజల యోగక్షేమాల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై తప్పుడు కథనాలు ప్రసారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా ఎమ్మెల్యే సుచరితపై గురువారం పలు చానల్స్, పత్రికలు కావాలనే తప్పుడు రాతలు రాశాయని మండిపడ్డారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్ పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా వైఎస్సార్ సీపీ పాలన

ఎమ్మెల్యే గిరిధర్



విద్యార్థినికి ట్యాబ్ అందిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

నగరంపాలెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడేళ్ల పాలన చరిత్రలో నిలిచేలా ఉందని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. 19వ డివిజన్ 63వ సచివాలయ పరిధిలోని నల్లచెరువు ఎనిమిదో వీధిలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డివిజన్ ఇన్‌చార్జి టెంట్ హౌస్‌బాబు అధ్యక్షత వహించారు. అనంతరం గడప గడపకు వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలు తెలుసుకుని, వెంటనే పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోందని చెప్పారు. గత మూడేళ్లల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల్ని 95 శాతం అమలుచేసి చూపించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల్ని కుల, మత, రాజకీయాలు, ప్రాంతాలనే భేదాలు లేకుండా అర్హులైన పేదలందరికీ పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత సీఎం వై.ఎస్. జగన్‌కే సాధ్యమైందని తెలిపారు. దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఒక్కడుగు ముందుకు వేస్తే, వై.ఎస్.జగన్ నాలుగు అడుగులు ముందుకు వేసి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. వాటిని పేదలకు అందకుండా ఉండేందుకు అడుగడుగునా ప్రతిపక్ష నేత చంద్రబాబు అడ్డుపడుతున్నారని విమర్శించారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో బుట్టదాఖలైందని, మాటిస్తే మరుక్షణమే గాలికి వదిలేశారని ఆరోపించారు. టీడీపీపై ప్రజలకు నమ్మకం లేదని, రానున్న ఎన్నికల్లో ప్రజానీకం బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తున్న సీఎం వై.ఎస్.జగన్‌కు ప్రజలు ఆశీస్సులు అందించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు మహేష్, రాష్ట్ర బత్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ రామరాజు, నాయకులు కామిశెట్టి మధు, సోమీకమల్, కె.ప్రేమ కుమార్, మల్లవరపు బుజ్జి, నాగూర్, అంజనాదేవి, సుభాని, ఫాతిమున్, ఆచారి పాల్గొన్నారు.

ఫైబ్రో స్కాన్‌తో లివర్ పనితీరుపై సమగ్ర అవగాహన

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ నాగూర్ బాషా



ఫైబ్రో స్కాన్ పరీక్ష చేస్తున్న డాక్టర్ నాగూర్ బాషా

గుంటూరు మెడికల్: ఫైబ్రో స్కాన్ పరీక్ష ద్వారా కాలేయంలోని కొవ్వు శాతం, గట్టితనం, ఫైబ్రోసిస్ ఏదశలో ఉందో ముందస్తుగానే తెలుసుకోవచ్చని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కేర్‌వెల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ షేక్ నాగూర్ బాషా తెలిపారు. స్థానిక గుంటూరు వారి తోట 7వ లైన్‌లోని కేర్‌వెల్ హాస్పిటల్‌లో గురువారం లివర్ సమస్యతో బాధపడుతున్నవారికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒక్కో రోగికి సుమారు రూ. 10 వేల విలువ చేసే ఫైబ్రో స్కాన్ 60 మందికి ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగూర్ బాషా మాట్లాడుతూ ఆల్కాహాల్ తీసుకునేవారు, హెపటైటీస్ బీ, హైపటైటీస్ సీకి గురైన వారు అధిక బరువు ఉన్న వారు, షుగర్ వ్యాధితో బాధపడేవారు ఫ్యాటీ లివర్‌కు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. దీనివల్ల కాలేయం గట్టిపడి పనితీరు మందగిస్తుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక వ్యాధి బాధితులు ఫైబ్రోస్కాన్ పరీక్ష చేయించుకోవడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చని ఆయన సూచించారు. ప్రతినెలా రోగులకు తమ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తున్న ఫైబ్రోస్కాన్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ బాషా కోరారు.

అగ్నిమాపక పరికరాల ఏర్పాటు తప్పనిసరి

జిల్లా అగ్నిమాపకశాఖాధికారి వెంకటేశ్వరరావు



జిల్లా అగ్నిమాపకశాఖాధికారితో అప్సా నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల్లో విధిగా అగ్నిమాపక పరికరాల్ని ఏర్పాటు చేయాలని జిల్లా అగ్నిమాపకశాఖాధికారి ఎన్. వెంకటేశ్వరరావు చెప్పారు. ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) జిల్లా ప్రతినిధులు గురువారం ఆయన్ను కలెక్టరేట్ ప్రాంగణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో కలిశారు. పలు అంశాల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఫైర్ ఎన్‌ఓసీ లేని ప్రతి ప్రైవేటు పాఠశాల విధిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అగ్నిమాపక పరికరాలు, పైపులైన్లు, రెండు వైపులా బయటకు వెళ్లే మార్గాల్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఎన్‌ఓసీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనుమతులు పొందడంలో సమస్యలున్నట్లయితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. దీనిపై అప్సా రాష్ట్ర నాయకుడు మేకల రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అప్సా నాయకులు చెరుకూరి శ్రీహరి, వంగా శ్రీనివాసరావు, రాజేష్, ఏ. సురేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముందస్తు సంక్రాంతి సంబరాలు



నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగువారి సంక్రాంతి పండుగ ఎంతో విశిష్టమైనదని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మనోహర్ నాయుడు పాఠశాల ప్రాంగణంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సంక్రాంతి సంబరాల్ని తిలకించారు. తెలుగువారి సంప్రదాయ కళలైన నృత్యాలు, కోలాటం, గంగిరెద్దులాట, కోడి పందాలతో పాటు తెలుగు పిండివంటలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. పాఠశాల యాజమాన్యాన్ని, విద్యార్థుల్ని మేయర్ అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పీఆర్కే గోపాలరాజు, కోశాధికారి మాజేటి ప్రసాద్, డైరెక్టర్ ఎం. సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్ఎం ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు

మేయర్ కావటి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తెలిపారు. సంక్రాంతి సంబరాల నిర్వహణపై నగరపాలక సంస్థ పాఠశాలల పీఈటీలు, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు, యన్‌టీఆర్ స్టేడియంలోని వివిధ విభాగాల కోచ్‌లతో గురువారం తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జనవరి 9వ తేదీ సాయంత్రం నాటికి పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు సేకరించాలని తెలిపారు. 11, 12 తేదీల్లో పోటీలు నిర్వహించి, 16న క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేయాలని చెప్పారు. అధికారులు, పీఈటీలు బృందాలుగా ఏర్పడి క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈలు పాల్గొన్నారు.

పక్షులను సంరక్షించాలి

పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. జవరి 5న నేషనల్ బర్డ్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యావరణ విద్యా పరిషత్ ఆధ్వర్యంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం కట్టి పక్షి, జంతు జాతుల సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కాకాని శివాలయంలో శివ ముక్కోటికి భారీ ఏర్పాట్లు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆరుద్రోత్సవం (శివ ముక్కోటి) శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆరుద్రోత్సవ విశిష్టతను ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు వివరించారు. సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించిన పిమ్మట ధనుర్మాసంలో వచ్చే ఆరుద్రా నక్షత్రాన ఈశ్వరునికి ఆరుద్రోత్సవం, తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని తెలిపారు. ఆరుద్రోత్సవం రోజున తెల్లవారుజామున 4 గంటలకు బ్రాహ్మీ ముహూర్తాన విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, మహన్యాసపూర్వక పంచామృతాలతో ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీమల్లేశ్వరస్వామికి 108 కిలోల బియ్యంతో వండిన అన్నంతో అభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. దానితో పులిహోర, చక్రపొంగలి, దధ్యోజనం తయారు చేసి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తామని ప్రధాన అర్చకుడు పొత్తూరి ప్రసాద్ వివరించారు. స్వామి ఉత్సవమూర్తులను వాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహిస్తామని ఏసీ ఎన్. శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రహదారులపై ఆక్రమణల తొలగింపు

పట్నంబజారు: రహదారుల ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. గురువారం నగరపాలక సంస్థ అధికారులతో కలసి ఆక్రమణల్ని తొలగించారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ నిసార్ బాషా పర్యవేక్షణలో ఎస్ఐ హరిబాబు, సిబ్బంది పల్నాడు బస్టాండ్ సెంటర్, చేపల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా రోడ్డును ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన దుకాణాలు, తోపుడు బండ్లను తొలగించారు. ప్రజలకు, వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ అధికారులు ఆక్రమణదారుల్ని హెచ్చరించారు.

పింఛన్‌దారులకు అండగా సీఎం : ఎమ్మెల్యే ముస్తఫా



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా దఫాలుగా పెంచుతూ పింఛన్‌దారులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. 12వ డివిజన్‌లో కింగ్ హోటల్ సమీపంలో గురువారం ఆయన లబ్ధిదారులకు రూ. 2750ను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఖాజామొహిద్దీన్‌చిష్టి, పార్టీ మహిళా నేత నూరిఫాతిమా పాల్గొన్నారు.

జైనుల శాంతి ర్యాలీ



పాత గుంటూరు: ఝార్ఖండ్ గిరిడి జిల్లాలోని సమ్మేద్ శిఖర్ పుణ్యక్షేత్రాన్ని అక్కడి ప్రభుత్వం పర్యాటక క్షేత్రంగా ప్రకటించడం, గుజరాత్‌లోని భావనగర్ జిల్లాలో పాలితానా పుణ్యక్షేత్రంలో అక్రమ మైనింగ్‌కు నిరసనగా గురువారం జైనులు శాంతి ర్యాలీ నిర్వహించారు. క్లాత్ బజార్‌లోని జైను దేవాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జాయింట్ కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జైన్ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికీ ఉజ్వల భవిష్యత్తును అందజేయడం తమ కళాశాల లక్ష్యమని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారు లాంలోని కళాశాలలో గురువారం బిట్ ల్యాబ్స్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు 41 మంది ఉద్యోగాల్ని సాధించారని చెప్పారు. ఏడాదికి రూ 3.5 లక్షల వార్షిక వేతనంతో సంస్థ వారితో ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థుల్ని కళాశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు, సెక్రటరీ సుజిత్, వైస్ ప్రిన్సిపాల్ కె. కిరణ్ అభినందించారు.

టీం వర్క్‌తో అత్యున్నత విజయాలు



గుంటూరు రూరల్: వ్యక్తిగత నైపుణ్యాల కన్నా విద్యార్థులంతా టీమ్ వర్క్ ద్వారా అత్యున్నత విజయాల్ని సాధించవచ్చని గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) ఎం.రామకృష్ణ తెలిపారు. చౌడవరంలోని కళ్లం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సంకల్ప్–2023 జాతీయస్థాయి సాంకేతిక విద్యార్థుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాల్ని మెరుగు పరుచుకుంటూ, సమష్టి కృషితో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కళాశాల డైరెక్టర్ ఎం.ఉమాశంకర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయి సదస్సులో ఏపీ, తెలంగాణ నుంచి మొత్తం 2 వేల మందికిపైగా విద్యార్థులు పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పాల్గొన్నారని తెలిపారు. రెండు రోజులపాటు సదస్సు జరుగుతుందని చెప్పారు.

నగరంలో ఓటర్ల లెక్క తేలింది

మొత్తం 5,01,507 మంది ఓటర్లు

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరి రివిజన్– 2023 అనంతరం గుంటూరు నగర పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 5,01,507 మంది ఉన్నారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి (ఈఆర్ఓ.) కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మరి రివిజన్ ఓటర్ల తుది జాబితాను గురువారం నుండి బూత్‌ల్లో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

వివరాలు ఇలా...

- 2022 నవంబర్ 9 నుంచి మొదలైన స్పెషల్ సమ్మరి రివిజన్– 2023లో భాగంగా తూర్పు నియోజకవర్గంలో పురుషులు 2,620, స్త్రీలు 3,154, థర్డ్ జెండర్ ఇద్దరు నూతనంగా నమోదు అయ్యారు. దీంతో నియోజకర్గంలో పురుషులు 1,15,130, స్త్రీలు 1,21,747, థర్డ్ జెండర్ 46 మంది ఓటర్లు ఉన్నారు.
- పశ్చిమ నియోజకవర్గంలో పురుషులు 2,276 మంది, స్త్రీలు 2,663, థర్డ్ జెండర్ ఇద్దరు నూతనంగా నమోదు అయ్యారు. దీంతో నియోజకవర్గంలో పురుషులు 1,29,227, స్త్రీలు 1,35,303, థర్డ్ జెండర్ 54 మంది ఓటర్లు ఉన్నారు.

యువతీ యువకుల సంఖ్య ఇలా...

18–19 ఏళ్ల వయస్సు గల యువతీయువకులు పశ్చిమ నియోజకవర్గంలో 2,320 మంది, తూర్పు నియోజకవర్గంలో 2,497 మంది నూతన ఓటర్లగా నమోదు అయ్యారు.

రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



సీఐతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

నగరంపాలెం: రౌడీషీటర్లు, అనుమానితుల వ్యవహారశైలి, కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ (పీఎస్)ను గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. పెండింగ్, ముఖ్యమైన కేసుల వివరాలు, లాకప్, కంప్యూటర్ గది, పరిసరాల్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాపర్టీ, మిస్సింగ్, ముఖ్యమైన కేసుల్ని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని తెలిపారు. గొలుసు దొంగతనాలు జరగకుండా పరిసర ప్రాంతాల్లో నిఘా ఉండాలని చెప్పారు. రాత్రుళ్లు విధులు నిర్వర్తించేటప్పుడు తప్పనిసరిగా వేలిముద్రల యంత్రాన్ని ఉపయోగించాలని ఆదేశించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభ వేళలు, సాయంత్ర వేళల్లో గస్తీ నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్బీ సీఐ బి.నరసింహ, ఎస్ఐలు విజయ్‌కుమార్, హనుమంతరావు, సీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నిసార్ బాషా

పట్నంబజారు: ప్రయాణికుల్ని ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని, ఆటో డ్రైవర్లంతా కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సీఐ నిసార్ బాషా తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో గురువారం ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఆటోవాలాలు తిరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నూతనంగా ఆటో తీసుకునే ప్రతి ఒక్కరూ పోలీసు నంబర్‌తో పాటు, విధిగా వారి సెల్ నంబర్లను ఆటోలో ప్రదర్శించాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లపై ఆటోలు నిలుతున్నారని, ఇకపై జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు సూచనల మేరకు చార్జీలు వసూలు చేయాలని, ప్రయాణికుల్ని ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్ఐ జానీ బాషా పాల్గొన్నారు.

మహిళా పోలీసుల చేతుల్లోనే వార్డు రక్షణ బాధ్యత



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో సుబ్బారావు

పట్నంబజారు: ప్రతి వార్డు మహిళా పోలీసు కచ్చితంగా వారికి కేటాయించిన సచివాలయాల పరిధిలో సమాచారాన్ని పూర్తిస్థాయిలో తెలుసుకుని ఉండాలని లాలాపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం. సుబ్బారావు చెప్పారు. లాలాపేట పీఎస్‌లో గురువారం వార్డు మహిళా పోలీసులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సుబ్బారావు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు, ప్రజల్ని ఇబ్బందులు గురి చేసే వారు, సమస్యలు సృష్టించే వారి సమాచారం ముందస్తుగా తెలుసుకుని, సంబంధిత స్టేషన్ అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ముఖ్యంగా రౌడీషీటర్ల ప్రవర్తన శైలి ఎలా ఉందో ఎప్పటికప్పుడు కనిపెట్టాలని చెప్పారు. మహిళలు, యువతులు, విద్యార్థినులను ఇబ్బందులను గురి చేసినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వ్యక్తులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని ఆయన తెలిపారు.

మలినేని కళాశాలకు నాక్ ఏ ప్లస్ హోదా

ప్రత్తిపాడు: మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏ ప్లస్ హోదా లభించిందని చైర్మన్ మలినేని పెరుమాళ్లు తెలిపారు. స్థానిక కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది డిసెంబరు 27,28 తేదీల్లో తమ కళాశాలకు వచ్చిన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడియేష్, కౌన్సిల్ (ఎన్ఏఏసీ) బృందం విద్యా ప్రమాణాలు, నాణ్యత, ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానం వంటి వాటిని పరిశీలించి జాతీయ స్థాయిలో ఏ ప్లస్ గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరం నుంచి ఐదు సంవత్సరాల వరకు జాతీయ స్థాయిలో అత్యుత్తమ విద్యను అందించే కళాశాలల జాబితాలో కూడా స్థానం సంపాదించిందని చెప్పారు.

ఈ- బైక్స్ నూతన షోరూం ప్రారంభం



ఈ-బైక్‌ను ప్రారంభిస్తున్న విల్సన్‌బాబు

పాత గుంటూరు: నగరంపాలెం సెంటర్‌లో జీఆర్‌జీ ఈ- బైక్స్ నూతన షోరూం గురువారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్. విల్సన్‌బాబు, రాష్ట్ర సమాచార కమిషనర్ పి. శామ్యూల్ జోనాథన్ ముఖ్య అతిథులుగా పాల్గొని షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా విల్సన్‌బాబు మాట్లాడుతూ సహజ ఇంధన వనరుల పొదుపునకు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత విద్యుత్ వాహనాల్ని వినియోగంలోకి మరింతగా తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో రుణాలు అందిస్తూ ఈ- బైక్ కొనుగోలును ప్రోత్సహించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ నాయబ్ కమాల్, విశ్రాంత కమర్షియల్ టాక్స్ డెప్యూటీ కమిషనర్ టి.వి. రావు, పరిశ్రమల శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఎం. సుధాకర్ పాల్గొన్నారు.